క్లుప్తంగా

బీజేపీలో పలువురి చేరిక


ఎంపీ సమక్షంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం వావిలాల గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు సోమవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి రఘునందన్‌రావు కాషాయ కండువాలు కప్పి స్వాగతించారు. బీజేపీలో చేరిన వారిలో వడ్ల సతీష్, ఆకాష్, సంపత్, విక్రమ్, వంశీ, శివశంకర్, ఓంకార్, సత్యనారాయణ వరుణ్, హరిప్రసాద్, కృష్ణంరాజు, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజు సీనియర్ నాయకులు అశోక్‌కుమార్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ రాంరెడ్డి

మునిపల్లి(అందోల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు మాజీ ఎంపీపీ రాంరెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. మండలంలోని కంకోల్ గ్రామ శివారులో పీహెచ్‌సీ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దుర్గయ్య, డైరెక్టర్ ఖదీర్‌మీయా, సంగన్న పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి


రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ డబ్బులు చెల్లించిన తరువాతే ఆశావర్కర్లతో లెప్రసీ సర్వే చేయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కస్లర్ అధికారి రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు అదనంగా పనులు అప్పగిస్తూ.. డబ్బులు మాత్రం ఇవ్వడం లేదన్నారు. లెప్రసీ సర్వే చేయించి డబ్బులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారన్నారు. తిరిగి కొత్తగా సర్వే చేయమని వత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. పెండింగ్ డబ్బులు చెల్లించే వరకు సర్వే చేయరని స్పష్టం చేశారు.

ఆశావర్కర్ల నిరసన

కల్హేర్(నారాయణఖేడ్): పెండింగ్‌లో డబ్బులు చెల్లించాలని సిర్గాపూర్‌లో ఆశా వర్కర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సిర్గాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ ప్రతిభకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు పల్స్ పోలియో, లెప్రసీ పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతే కొత్తగా సర్వే పనులు చేయించాలని డిమాండ్ చేశారు.

విజయోత్సవాలు సిగ్గుచేటు

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి


మాట్లాడుతున్న గోదావరి తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన అరు అబద్ధాలు, 66 మోసాలతో సాగిందని, సంవత్సర పాలనపై విజయోత్సవాలు జరపడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మండిపడ్డారు. సోమవారం ఆమె విలేరులతో మాట్లాడారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం 6గ్యారంటీ పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో కేవలం అధికార మార్పిడి మాత్రమే జరిగింది.. పరిపాలన కాదన్నారు. కేసీఆర్ కుటుంబంతో పాటు రేవంత్ రెడ్డి కుటుంబాలు , తెలంగాణ సంపదను దోచుకోవడంలో పోటీ పడుతున్నారని ఆరోపించారు. అప్పుడు కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుంబం దోచుకుంటే.. ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబం మూసి పేరుతో దోచుకుంటుందన్నారు. 50శాతం కూడా రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసినందుకా? విజయోత్సవాలు అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు కావడం లేదని దుయ్యబట్టారు. ఎం కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, చెర్యాల రాములు పాల్గొన్నారు.

గురుకుల పాపం బీఆర్‌ఎస్‌దే..

ఎమ్మెల్యే సంజీవరెడ్డి ధ్వజం

నారాయణఖేడ్: గురుకులాలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఎమ్మెల్యే సంజీవ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, డైట్, కాస్మోటిక్ ఛార్జీలను 40 శాతం పెంచామన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన రోజునే ఏకరూపదుస్తులు, పుస్తకాలు అందజేసి విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. తాను 30 పాఠశాలలు, గురుకులాలు, డిగ్రీకళాశాలను తనిఖీ చేసి అక్కడి సమస్యలను పరిష్కరిస్తున్నానని తెలిపారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ గత ప్రభుత్వ హయాంలో తప్పిదాలంటూ యుద్ధం ప్రకటించి.. గురుకులాలను భ్రష్టు పట్టించారన్నారు. ఖేడ్‌లోని ఎంజేపీటీ గురుకులంలో రెండేళ్లుగా మినరల్ వాటర్‌ప్లాంటు చెడిపోతే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, తాను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించానని చెప్పారు. విద్యార్థులకు గ్రౌండ్‌లో రాత్రి అంధకారం సమస్య పరిష్కారానికి హైమాస్ట్ లైట్లు, చెడిపోయిన ఫ్యాన్లు, ట్యూబ్‌ల మరమ్మతులు చేయించానని గుర్తు చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఆర్డీఓ అశోకచక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, తహసీల్దార్ భాస్కర్, శానిటరీ అధికారి శ్రీనివాస్ వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్, పండరిరెడ్డి, శంకర్, మాణిక్యం పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మెరుగుపడ్డ సేవలు


వైద్యుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సేవలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..మాతా, శిశు సంరక్షణ సేవలు మెరుగుపడటంతో పాటు ప్రసవాలు గణనీయంగా పెరిగాయన్నారు. రేడియాలజీ హబ్ ద్వారా ల్యాబ్ సేవలతో రోగులకు వ్యయ ప్రయాసలు తప్పాయన్నారు. ఇన్ పేషెంట్ల వార్డుల విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రోగులకు మెరుగైన సేవలను అందిస్తున్నందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రమేష్‌తో పాటు వైద్యులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ శంకర్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. గ్రామంలో ఉద్రిక్తత

హత్నూర(సంగారెడ్డి): ఒప్పందం ప్రకారం భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకపోవడంతో వ్యక్తిపై దాడి చేసిన సంఘటన హత్నూర మండలం బడంపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గవ్వల కుమురయ్య నవంబర్ 1న వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ సమయంలో గ్రామానికి చెందిన ఈర్నాల రవి, లాలీ జనార్దన్ ఘటన స్థలంలో ఉండడంతో వారే హత్య చేసి ఉంటారని కొమురయ్య కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో అప్పట్లో గ్రామంలో పంచాయతీ నిర్వహించి, ఈర్నాల రవి, లాలి జనార్దన్ ఇద్దరూ 12 గుంటల భూమి ఇస్తామని రాసి ఇచ్చారు. భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకపోవడంతో సోమవారం కొమురయ్య కుటుంబ సభ్యులు ఈర్నాల రవి పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నడంతో అతను దూషించగా దాడి చేశారు. గ్రామ నడిబొడ్డులోని కార్యాలయం భవనం దిమ్మెకు ఇర్నాల రవిని కట్టేసి దాడి చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఇరు కుటుంబాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్‌ఐ దుర్గయ్య సిబ్బందితో కలిసి దాడిని అడ్డుకోవడంతో గొడవ సద్దుమణిగింది.


ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

ఆకస్మికంగా హాస్టల్ తనిఖీ

జహీరాబాద్: పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌ను ఆర్డీఓ రాంరెడ్డి సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇస్తున్న భోజనం, నిత్యావసరుకుల నాణ్యతను పరిశీలించారు. అన్నం, పప్పు, కూరగాయలు, గుడ్లు, మజ్జిగ నాణ్యతను చూశారు. వంటగది, మరుగుదొడ్లను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అన్నం వేడిగా అందించాలని సిబ్బందికి సూచించారు.

హాస్టల్ సందర్శన

జహీరాబాద్: గురుకుల బాటలో భాగంగా సోమవారం పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర హాస్టళ్లను బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి సతీష్ సందర్శించారు. దో మలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సోలార్ యూనిట్లు పనిచేయడం లేదని, తగినన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, మోహన్, రవికిరణ్, ఓంకార్, ఫయాజ్, అశోక్‌రెడ్డి, శివప్ప, మనోజ్ పాల్గొన్నారు.


భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాంరెడ్డి

ఘనంగా కోటి రుద్రాక్షల ఊరేగింపు

సంగారెడ్డి టౌన్: జ్యోతిర్ వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో కోటి రుద్రాక్షల ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. నేపాల్, వారణాసి నుంచి తీసుకువచ్చిన రుద్రాక్షలకు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీమహేశ్వర శర్మ సిద్ధాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దారి పొడవునా మంగళహారతులతో ప్రత్యేక స్వాగతాలు పలికారు. మహాశివరాత్రి రోజున కోటి రుద్రాక్షలతో లింగార్చన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్, ప్రశాంత్‌కుమార్, దారం సంజయ్‌కుమార్, కృష్ణమూర్తి, రామప్ప కాశీనాథ్, విఠల్ దాస్ పాల్గొన్నారు.


కోటి రుద్రాక్షల ఊరేగింపులో పాల్గొన్న సభ్యులు

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరసన

కల్హేర్(నారాయణఖేడ్): సమస్యలు పరిష్కరించాలని కల్హేర్ ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సోమవారం సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, సంగయ్య, రాములు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు

12 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం, దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందర్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 2 నుంచి 12వ తేదీ పదవ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు జరగనున్నాయి. బడి మధ్యలో మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. పూర్తి వివరాలకు సెల్: 9963253279 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన కార్యదర్శులు

సంగారెడ్డి: గ్రామ పంచాయతీకి నిధులు విడుదల, పెండింగ్ చెల్లింపులు చేయాలని సంగారెడ్డి టీఎన్జీఓ అధ్యక్షుడు జావేద్ అలీ ఆధ్వర్యంలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం కలెక్టర్‌ను కలిశారు. గ్రామాల అభివృద్ధి కుంటుపడకుండా వెంటనే నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, డీపీఓ సాయిబాబాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు సందిల బలరాం, సంగారెడ్డి టీఎన్జీఓ సహ అధ్యక్షుడు వెంకటరెడ్డి, సంగారెడ్డి ఫోరం అధ్యక్షుడు వేంకటేశ్, నాయకులు మల్లికార్జున్, ఇమ్రాన్, జగన్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: మండలంలోని ర్యాకల్‌కు చెందిన గైని చంద్రమ్మకు ఎమ్మెల్సీ యాదవరెడ్డి సిఫార్సుతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.45 వేలు మంజూరయింది. సంబంధిత చెక్కును సోమవారం ఖేడ్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య, మండల బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు నర్సింహులు, గోపాల్‌రెడ్డి, సాయాగౌడ్, నర్సింహులు, మల్గొండ, దశరథ్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 19 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 16 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా, ముగ్గురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి

డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్

సంగారెడ్డి రూరల్: ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టి, అనుమతి లేకుండా నడుస్తున్న డయాగ్నోటిక్ సెంటర్లను సీజ్ చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా వైద్య అధికారి ఏఓ శ్రీవాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు విచ్చలవిడిగా ప్రజలను దోపిడీ చేస్తున్నాయని, కనీస సౌకర్యాలు కల్పించకుండా వేళల్లో ఫీజులు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. అనుమతి లేకున్నా ప్రైవేట్ హాస్పిటల్‌లో డయాగ్నోటిక్ సెంటర్లు నిర్వహిస్తూ రోగులను టెస్టుల పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని కారోపించారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో నకిలీ డాక్టర్లతో వైద్యం చేస్తున్నా సంబంధిత జిల్లా అధికారులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని మండిపడ్డారు. అలాగే అనుమతి లేకుండా నడుస్తున్న ఆస్పత్రులను మూసివేయించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు సాయి, శివకుమార్, ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆరు గ్యారంటీల అమలులో విఫలం


సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుతం విఫలమైందని మండల బీజేపీ అధ్యక్షుడు ఓంకార్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రం న్యాల్‌కల్‌లో బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపొందేందుకు చేతకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. హామీలను వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశ్ గంగ్వార్, రాహుల్, విష్ణు, బస్వరాజ్, గోరక్ నాథ్, అరుణ్ గౌడ్, శ్రీకాంత్, శివకుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తత అవసరం

ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: ఎయిడ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో హెచ్‌ఐవీ ప్రపంచ ప్రజా ఆరోగ్య సమస్యగా మిగిలిపోయిందని, హెచ్‌ఐవీకి చికిత్స లేదని నివారణ ఒకటే మార్గమని తెలిపారు. హెచ్‌ఐవీ మానవ శరీరంలోని తెల్లరక్త కణాలను లక్ష్యంగా చేసుకొని రోగ నిరోధక శక్తిని బలహీన పరుస్తుందన్నారు. హెచ్‌ఐవీకి యాంటీ రెట్రో వైరల్ ఔషధాలతో చికిత్స చేయనున్నారు. ఈ థెరపీ ద్వారా హెచ్‌ఐవీ సంక్రమణ నయం కాదు.. వ్యక్తి యొక్క రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నోముల యోగిబాబు, డాక్టర్ విజయలక్ష్మి, షరీఫ్‌మియా, బోధనేతర సిబ్బంది అరుణ్, 100 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

బొల్లారంలో..

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని డిజైర్ సొసైటీలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డేను నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంగాభవాని ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. బాధిత చిన్నారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వారి హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పోషక ఆహారంపై సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు నిర్మల, సిబ్బంది చిన్నారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి


పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌ఐ

న్యాల్‌కల్ (జహీరాబాద్): విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ పేర్కొన్నారు. ఇటీవల విధుల్లో చేరిన పోలీస్ సిబ్బందికి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో పలు సూచనలు చేశారు. చాలాకాలంగా సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం 14 మంది సిబ్బంది రావడంతో ఇబ్బందులు తొలగిపోయాయనని చెప్పారు. మండలంలో శాంతిభద్రతల రక్షణకు కృషి చేయాలని సూచించారు.

గ్రంథాలయాలతో ప్రయోజనం

జహీరాబాద్: పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బస్వరాజ్ సూచించారు. సోమవారం మండలంలోని హుగ్గెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూం టు రీడ్ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఒకటవ తరగతి పిల్లలపై ఎక్కువ దృష్టి పెట్టాలని, అందుకు లైబ్రరీ పుస్తకాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి నిత్యం విద్యార్థులు టైం ప్రకారంగా పుస్తకాలను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ఇన్‌చార్జి నర్సింహులు, ప్రధానోపాధ్యాయురాలు స్వరూప రాణి, ఉపాధ్యాయులు ఎం.జి.రాములు, కిషన్‌రాథోడ్, ఎం.అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటేశం, గోవిందమ్మ, సరిత, లావణ్య పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ బస్వరాజ్, తదితరులు

సంక్షిప్త వార్తలు

◆ **వైభవంగా పోలి పాడ్యమి**



పటాన్‌చెరు టౌన్: కార్తీకమాసం ఎంతో విశిష్టమైనది. కార్తీకమాసం ముగింపు సందర్భంగా సోమవారం తెల్లవారుజామున నేతితో ముంచిన వత్తులతో అరటి డొప్పలతో దీపాలు వెలిగించి, భక్తులు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవాలయంలో ఏర్పాటు చేసిన నీటి సంపులో విడిచి పోలికి వీడ్కోలు పలికారు. ఆలయ అర్చకులు గౌతమ్, మహేష్, గణేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **శబరిమలకు తరలిన స్వాములు**

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఈశ్వరాలయం నుంచి సోమవారం అయ్యప్పస్వాములు శబరిమల యాత్రకు బయలుదేరారు. 41 రోజుల పాటు దీక్షా ముగించుకొని గురుస్వాములచే ఇరుముడి కట్టుకొని స్వామియే శరణమయ్యప్ప నామస్మరణ చేస్తూ ముందుకు సాగారు. స్వాములు శబరిమలకు వెళ్తున్న సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

◆ **10న సదరం శిబిరం**

సంగారెడ్డి: ప్రతి నెల నిర్వహించే సదరం శిబిరం ఈ నెల 10న మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన స్లాట్స్ మూడవ తేదీ మంగళవారం ఉంటుందని చెప్పారు. శిబిరానికి వచ్చేవారు సంబంధిత పత్రాలు తీసుకొని రావాలని కోరారు .

◆ **ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సంగారెడ్డి రీజియన్ ఆర్టీసీ మెడికల్ అధికారి డాక్టర్ శృతి ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. పని ఒత్తిడి, అవిశ్రాంతితో ఆందోళనకు గురవుతుంటారని, వత్తిడి నుంచి ఎలా బయటపడాలి తదితర విషయాలను వివరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆమె డిపోలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకిర్ హుసేన్, గ్యారేజ్ సూపర్‌వైజర్ తరుమల్లేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **అక్రమ అరెస్టులు సరికాదు**



నారాయణఖేడ్: గురుకులాల సందర్శనకు వెళ్లకుండా అడ్డుకొని అక్రమ అరెస్టులు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. నారాయణఖేడ్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సోమవారం గురుకులాల సందర్శన కార్యక్రమం నిర్వహించారు. భూపాల్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అరెస్టులతో పోరాటం ఆగదని ప్రభుత్వంపై మండిపడ్డారు. నాయకులు రవీందర్‌నాయక్, పరమేశ్వర్, విఠల్‌రావు, నజీబ్, పరశురాం, అభిషేక్ షెట్కార్, నగేష్, సంగప్ప, విఠల్, ముజమ్మిల్, అంజాగౌడ్, మల్గొండ పాల్గొన్నారు.

◆ **మద్యం విక్రేతలపై కేసు**

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండలంలోని వాణినగర్‌కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం రావడంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి షేక్ మరవాలి , సహదేవ రాజు, రవీందర్, దుర్గారెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, 7.74 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అమీన్‌పూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

నేడు వాహనాల వేలం

గంజాయి రవాణా కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్ చెరువు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉ.10 గంటలకు వేలంలో పాల్గొనాలని కోరారు.

◆ **సీఎం కప్ నిర్వహణపై సమావేశం**

కల్హేర్(నారాయణఖేడ్): సీఎం కప్ క్రీడాపోటీల నిర్వహణపై సోమవారం సిర్గాపూర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మల్హూర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని సూచించారు. ఈపోటీల్లో యువత పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమశంకర్, ఎంపీఓ బ్రహ్మం, పంచాయతీ సెక్రటరీలు, పీఈటీలు పాల్గొన్నారు.

భారతీనగర్ పాస్టర్ల సంఘం అధ్యక్షుడిగా శ్యాంబాబు


పాస్టర్ల సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

పటాన్‌చెరు: భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఐక్య పాస్టర్స్ ఇవాంజెలిస్ట్ ప్రేయర్ ఫెలోషిప్ సంస్థ అధ్యక్షుడిగా పాస్టర్ శ్యాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. క్రైస్తవ చర్చిలు, పాస్టర్లు ఎదుర్కొన్న సమస్యలపై చర్చించారు. రానున్న క్రిస్మస్ వేడుకలను అన్ని సంఘాల సభ్యులందరూ కలిసి సంయుక్తంగా నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ఫెలోషిప్ నూతన కమిటీని ఎనుకున్నా రు. ఈ కమిటీ ఉపాధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్ ప్రధాన కార్యదర్శిగా క్రీస్తుదాసు, సంయుక్త కార్యదర్శిగా రమేష్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా డాక్టర్ జయరాజ్ విజయానంద్, స్పోక్స్ పర్సన్‌గా బిషప్ కరుణాకర్, మీడియా ఇన్‌చార్జిగా అమృతరావు, మార్క్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.